సాక్షి అనకాపల్లి

గురువారం । 14 । డిసెంబర్ । 2023



అపూర్వం గాంధీతత్వం

విశాఖ: కృష్ణా కళాశాలలో గాంధీతత్వంపై సదస్సు జరిగింది. నాగార్జున పూర్వ వీసీ బాలమోహన్‌దాస్ గాంధేయవాదం గురించి వివరించారు.



కాంతులీనిన పుష్కరిణి

సింహాచలం: పోలిపాడ్యమి సందర్భంగా అప్పన్న పుష్కరిణి బుధవారం వేకువజామున కార్తీక దీపాలతో కాంతులీనింది.



మార్గశిర మాసోత్సవాలకు శ్రీకారం

విశాఖ: శ్రీకనకమహాలక్ష్మి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలకు అంకురార్పణ జరిగింది.

న్యూస్‌రీల్

16న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

తుమ్మపాల: కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారత శాఖ ఆద్వర్యంలో ఈ నెల 16వ తేదీన స్థానిక ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం జరుగుతున్నట్లు సహాయ విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ జిల్లా అధికారి జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా (దివ్యాంగన్) మంత్రిత్వ శాఖ మంత్రి ఎ. నారాయణస్వామి విచ్చేసి ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. భారత ప్రభుత్వము ద్వారా గుర్తించబడిన ప్రముఖ కృత్రిమ అవయముల తయారీ కేంద్రం (ఆలిమ్ కో) హైదరాబాద్ ద్వారా జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణముల ఉచిత సరఫరాను జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, ఎంపీ బి.వి.సత్యవతి ఆదేశాల మేరకు వివిధ పరికరణాల పంపిణీకి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలిమ్ కో సంస్థ ద్వారా నమోదు చేసుకున్న లబ్ధిదారులు మాత్రమే సదరు క్యాంపునకు రశీదు, ఆధార్ కార్డ్ తీసుకొని హాజరై, సంబంధిత పరికరాలలను పొందాలని కోరారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



హాకీ మైదానంలో ఏర్పాట్లు

నక్కపల్లి: బీఎస్ హాకీ క్లబ్‌లు, ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు గురువారం నుంచి నక్కపల్లిలో ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల నిర్వహణకు బోదిగల్లం రోడ్డులోని క్రీడా మైదానాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రాంబాబు బుధవారం తెలిపారు. బాలబాలికల విభాగాల్లో ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు హాజరవుతారన్నారు. బాలికలకు నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలోను, బాలురకు హాకీ మైదానంలోను జరుగుతాయన్నారు.

16న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు

అనకాపల్లి టౌన్: స్థానిక న్యూకాలనీ రోటరీ హాలులో ఈనెల 16న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ అసిస్టెంట్ పాలక పాల్ విలియం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలపై సదస్సులో చర్చ జరుగుతుందని, వినియోగదారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్ర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా సంతోష్



వాసుపల్లి సంతోష్



జానకీరామ్

దొండపర్తి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగ కమిటీ ఉపాధ్యక్షుడిగా వాసుపల్లి సంతోష్ కుమార్ నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యార్థి విభాగం కమిటీలో విశాఖకు చెందిన నలుగురికి ప్రాతినిధ్యం కల్పించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. జోనల్ ఇన్‌చార్జ్‌గా(విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా) జానకీరామ్ రెల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జి.నాగేంద్ర రావు, సంయుక్త కార్యదర్శిగా బి.నిషాకుమార్ నియమించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన జి.వి.వి.భూషణం రాష్ట్ర కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా మాతే వెంకటరమణ నియమితులయ్యారు.

జూలో వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ

ఆరిలోవ (విశాఖ): జూలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఒక వెటర్నరీ వైద్యుడి పోస్టు భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నెలకు రూ.50 వేలు వేతనం చెల్లించనున్నామని, ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు జూ క్యూరేటర్ ఆఫీస్‌లో నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

నియోజకవర్గ కేంద్రమైన చోడవరం పట్టణాన్ని దీర్ఘకాలంగా వెంటాడుతున్న మంచినీటి సమస్య తీరింది. గత ప్రభుత్వాలన్నీ ఇక్కడి ప్రజల మంచి నీటి కష్టాలను నిర్లక్ష్యంగా చేయగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. సుమారు రూ.13 కోట్ల వ్యయంతో భారీ మంచినీటి ప్రాజెక్టును మంజూరు చేసింది. ఏడాదిన్నర కాలంలో ఈ పథకం పనులు శరవేగంగా పూర్తి చేసి ఇంటింటి కుళాయి వేసి వినియోగంలోకి తెచ్చింది. పట్టణ ప్రజలకు మంచినీటి కష్టాలు తీర్చింది.

- దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం
- రూ.13 కోట్లతో భారీ మంచినీటి పథకం నిర్మాణం
- చోడవరం ప్రజలకు తీరనున్న మంచినీటి కష్టాలు
- బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో పట్టణంలో ట్యాంక్‌లకు నీటి సరఫరా
- 8 వేల ఇళ్లకు కుళాయిలు



పెద్దేరు నది మధ్యలో పీఎస్‌పేట వద్ద నిర్మించిన భారీ మంచినీటి పథకం పంప్ హౌస్

ఫలించిన భగీరథ ప్రయత్నం



బెన్నవోలు కొండపై నిర్మించిన గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంక్, పైప్‌లైన్

చోడవరం : సుమారు 26 వేల మంది జనాభా ఉన్న చోడవరం పట్టణం పరిధిలో భూగర్భ జలాలు తాగునీటికి ఉపయోగకరంగా లేకపోవడంతో ఇప్పటి వరకు మంచినీటి ట్యాంక్‌ల ద్వారా అరకొరగా నీటి సరఫరా చేసేవారు. దీంతో బిందెడు మంచినీళ్ల కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితుల్లో పట్టణ ప్రజలకు మంచినీటి సమస్య శాశ్వతంగా తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రత్యేక శ్రద్ధ చూపారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో గతేడాది రూ.12 కోట్ల 80 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రధానంగా పట్టణంలో ఉన్న 9.50 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన ఏడు మంచినీటి వాటర్ ట్యాంక్‌లకు మంచినీరు పంపింగ్ చేసేందుకు సమీపంలో పీఎస్ పేట దగ్గర ఉన్న **పెద్దేరు నదిలో గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడంతో పాటు పట్టణంలో ప్రతి ఇంటికీ కుళాయిలు ఇచ్చే విధంగా ఈ పథకాన్ని మంజూరు చేశారు.** పథకం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సుమారు 8 వేల ఇళ్లకు ఇంటింటి కుళాయిల కోసం వీధుల్లో 80 కిలోమీటర్ల ప్రత్యేక పైప్ లైన్లు వేశారు. మరోపక్క పెద్దేరు నదిలో నిర్మించిన పంప్ హౌస్ పనులు పూర్తయ్యాయి. వరదలు వచ్చినప్పుడు సైతం ఈ పంప్ హౌస్ దగ్గరకు వెళ్లేందుకు వీలుగా జన్నవరం వంతెన సమీపంలో నది ఒడ్డు నుంచి ఫుట్‌వే వంతెన నిర్మాణం చేశారు.

వేగవంతంగా పనులు పూర్తి

బెన్నవోలు కొండపై 60 వేల లీటర్ల కెపాసిటీతో గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ట్యాంక్‌ను నిర్మించి నదిలో ఉన్న పంప్ హౌస్ నుంచి ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీరు పంపింగ్ అయి అక్కడ నుంచి చోడవరం పట్టణంలో ఉన్న 7 ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు నీటి సరఫరా చేసేందుకు వీలుగా సుమారు 5.7 కిలోమీటర్ల మేర ప్రత్యేక పైపులైన్ వేశారు. ఇంత భారీ మంచినీటి ప్రాజెక్టు ఏకకాలంలో వేగవంతంగా పనులు పూర్తి చేయడంతో చోడవరం నియోజకవర్గంలో ఇదే మొదటిసారి. చోడవరం మేజర్ పంచాయతీలో ఉన్న చోడవరం, పీఎస్‌పేట, బంగారమ్మపాలెం, అన్నవరం, వెంకయ్యగారిపేటతోపాటు జన్నవరం, బెన్నవోలు గ్రామాలకు కూడా ఈ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ **నుంచే ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు మంచినీటి సరఫరా చేస్తున్నారు. ఇంటింటి కుళాయి పనులు కూడా పూర్తయ్యాయి. మరో రెండు వారాల్లో ఈ పథకాన్ని** ప్రారంభించేందుకు అన్నీ సిద్ధం చేశారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, జల్‌జీవన్ మిషన్ పథకం అధికారులు సంయుక్తంగా పనిచేశారు. ఈ పథకం వినియోగంలోకి రావడంతో దీర్ఘకాలంగా మంచినీటి కోసం పడుతున్న చోడవరం ప్రజల తాగునీటి కష్టాలు పూర్తిగా తొలగిపోయాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటింటి కుళాయిల కోసం వేసిన పైపులైన్లు

బిందెడు నీళ్లు దొరికేవి కావు..



ఇప్పటి వరకూ బిందెడు మంచినీటి కోసం వీధి కుళాయి దగ్గర గంటల తరబడి ఉండేవాళ్లం. బిందెలు లైన్‌లో పెడితేనే కానీ బిందెడు నీళ్లు రోజుకి దొరికేవి కాదు. ఒక్కోసారి రోజుల తరబడి నీళ్లు వచ్చేవికాదు. పొలాల్లో ఉన్న బోర్ల దగ్గరకు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకునేవాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ట్యాంక్ కట్టి, ఇంటింటికీ కుళాయి వేశారు. ఇక మంచినీరు కోసం ఎక్కడకీ వెళ్లాల్సిన పని లేదు. మాకు మంచినీటి సమస్య తీరింది.

–అప్పలనర్సమ్మ, దుర్గాకాలనీ, చోడవరం

కష్టాలు తప్పాయి...



రెండ్రోజులకి ఒకసారి బిందెడు మంచినీళ్లు దొరకడం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. చాలా మంది నాయకులు వచ్చారు కానీ మా మంచినీటి సమస్యను ఎవరూ పూర్తిగా పరిష్కరించలేదు. ట్యాంక్‌ల ద్వారా రెండ్రోజులకి ఒకసారి నీళ్లు ఇచ్చేవారు. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక భారీ మంచినీటి పథకం కట్టడంతో పాటు ఇంటింటికీ కుళాయిలు వేశారు. ఇక మాకు మంచినీటి కష్టాలు ఉండవు.

–మహాలక్ష్మి, కోఆపరేటివ్ కాలనీ, చోడవరం

నేడు సీఎం ట్రాన్సిట్ హాల్ట్



మహారాణిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి గురువారం విశాఖ రానున్నారు. ఆయన గన్నవరం నుంచి బయలుదేరి ఉదయం 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఇక్కడ నుంచి 9.30 గంటలకు హెలికాప్టర్‌లో శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం మకరాంపురం గ్రామానికి బయలుదేరుతారు. తిరిగి మధ్యాహ్నం 3.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరుతారు.

ఆటకు సై



ట్రయల్ మ్యాచ్ ప్రారంభిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు

'ఆడుదాం ఆంధ్రా' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన క్రీడా సంబరం శుక్రవారం ప్రారంభం కానుంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఐదు క్రీడాంశాల్లో ప్రతిభను వెలికి తీసేందుకు అన్ని ప్రాంతాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. విశాఖలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

IIలో

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ ఆరోగ్య కేంద్రాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేందుకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక, ఇనుము, సిమెంట్, భవననిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణ సామాగ్రి వంటి అంశాలను బేరీజు వేసుకొని ఎటువంటి ఆలస్యం లేకుండా పనులను పూర్తి చేయాలని, పూర్తయిన పనులకు వివిధ దశల్లో బిల్లులు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. వేగంగా బిల్లులు అందించి ప్రారంభాలు నిర్వహించాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని, అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ఈఈ వీరునాయుడు, గృహనిర్మాణ శాఖ పీడీ కె .రమామణి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాకు సహకరించండి

తుమ్మపాల : ఇప్పటివరకు జిల్లాలోని ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు కోసం 1,03,455 దరఖాస్తులు తీసుకోగా వాటిలో 44,330 సవరణలు చేశామని, ఇంకా 59,124 సవరణలు చేయవలసి ఉందని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను పూర్తిగా నియమించాలన్నారు. రాజకీయ పార్టీలకు ఏదైనా తప్పులు కనబడితే తమ దృష్టికి తీసుకురావచ్చని, వెంటనే దానిని పరిశీలించి సరి చేస్తామన్నారు. లిఖిత పూర్వకంగా డీఆర్‌వో, ఆర్డీవో, ఈఆర్వోలకు తెలియజేయవచ్చన్నారు. ప్రతి బూత్‌లో శతశాతం స్వచ్ఛమైన జాబితా ఉండేలా అధికారులకు రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. ముఖ్యంగా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్‌వో బి. దయానిధి, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, వివిధ పార్టీల ప్రతినిధులు బి.సంతోష్, కె.హరినాథబాబు, పి.నాగేశ్వరరావు, ఎస్.వి.వి రామచంద్రరావు, ఎన్నికల భాగం పర్యవేక్షకులు లక్ష్మీదేవి, ఎస్.ఎ.తులసీరామ్ పాల్గొన్నారు.

ఏలేరు, తాండవ అనుసంధానం..

భూసేకరణకు రూ.7 కోట్లు

- నిధులు రాగానే ఎత్తిపోతల పనులు ప్రారంభం
- ఏలేరు కాలువ మరమ్మతులు పూర్తి
- నేటి నుంచి ఏలేరు నీటి విడుదల
- ఏలేశ్వరం రిజర్వాయరు ఈఈ భాస్కరరావు



ఏలేరు కాలువ మరమ్మతు పనులు పరిశీలిస్తున్న ఏలేశ్వరం రిజర్వాయరు ఈఈ భాస్కరావు, డీఈ వినోద్

నాతవరం: ఏలేరు తాండవ ప్రాజెక్టు అనుసంధానం ఎత్తిపోతల పథకానికి రైతుల నుంచి సేకరించిన భూములకు డబ్బులు చెల్లించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏలేశ్వరం ప్రాజెక్టు ఈఈ భాస్కరరావు అన్నారు. మండలంలో ఏలేరు కాలువ 60వ కిలోమీటరు వద్ద మరమ్మతు పనులను బుధవారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు జిల్లాల రైతుల నుంచి సేకరించిన భూములకు సుమారుగా రూ.7 కోట్లు అవసరం అవుతుందన్నారు. నిధుల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఈ నెలలో నిధులు వచ్చిన వెంటనే రైతులకు ఇవ్వవలసిన డబ్బులు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పేరున డిపాజిట్ చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఏలేరు కాలువ గండి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశామన్నారు. నిలుపుదల చేసిన కాలువలో నీటిని గురువారం నుంచి విడుదల చేస్తామని, ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశాక విశాఖ చేరుకోవడానికి సుమారుగా 8 నుంచి 10 రోజులు సమయం పడుతుందన్నారు. ఈ వ్యవధిలో అనకాపల్లి విశాఖపట్నం జిల్లాలో ఎక్కడైనా ఏలేరు కాలువకు మరమ్మతులు ఉంటే చేసుకునేందుకు సమయం ఉంటుందన్నారు.

సహకారంలో మణిహారం

- సేవల్లో మునగపాక పీఏసీఎస్ భేష్
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా లావాదేవీలు
- ఇతర సహకార సంఘాలకు స్ఫూర్తి
- రేపు సొసైటీ శత వార్షికోత్సవం

మునగపాక: సహకార సంఘంలో మణిహారంగా నిలుస్తుంది మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం. నిత్యం వినియోగదారులతో కళకళలాడుతుంది. జిల్లాలో పలు సంఘాలు నష్టాలను ఎదుర్కొంటున్నా ఈ సంఘం మాత్రం లాభాల బాటలో పయనిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. సహకార స్ఫూర్తికి అద్దం పడుతూ రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ ఆదర్శ సొసైటీగా పేరుగాంచింది. ఈ సొసైటీ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ నెల 15వ తేదీన శత వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సంఘ పరిధిలో పాటిపల్లి, మంగళవరపుపేట, పల్లపు ఆనందపురం, పురుషోత్తపురం, రాజుపేట, కాకరాపల్లి, నాగవరం, వాడ్రాపల్లి, మల్లవరం, తిమ్మరాజుపేట తదితర గ్రామాల రైతులున్నారు. సొసైటీ ద్వారా రేషన్, ఎరువుల వ్యాపారం వంటి సేవలు కూడా అందిస్తున్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా మునగపాక సొసైటీ లావాదేవీలు జరుపుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 98 సొసైటీలు ఉండగా వాటిలో 25 సొసైటీలు మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో మునగపాక సొసైటీ ఒకటిగా నిలిచింది. సంఘ కార్యాలయం ఆధునికీకరణ కోసం రూ.6 లక్షలకు పైగా ఖర్చు చేశారు. రైతులకు అందుబాటులో ఉండేలా ఏటీఎం కూడా తీసుకువచ్చారు.

వన్నె తెచ్చిన సంక్షేమ పథకాలు

మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని 1923 మే 31న ఇదే గ్రామానికి చెందిన పెంటకోట శ్రీరాములునాయుడు ప్రారంభించారు. రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మునగపాక సొసైటీకి గుర్తింపు తీసుకువచ్చాయి. రుణం పొందిన రైతు మృతి చెందితే రూ.20 వేలు.. దహన సంస్కారాలకు రూ.6 వేలు అందజేస్తారు. సొసైటీ ద్వారా పలు సేవా కార్యక్రమాలతో పాటు పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు సూచనలందిస్తుంటారు.



మునగపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం



సంఘం ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్న దృశ్యం



మునగపాక పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎం

సత్ఫలితాలిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం

మునగపాక సొసైటీ ద్వారా 8 సంవత్సరాల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కేంద్రం మంచి ఫలితాలు ఇస్తోంది. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు అందుబాటులోకి రావడంతో రైతుల నుంచి స్పందన వస్తుంది.

సొసైటీకి తీసుకువచ్చిన ధాన్యానికి 21 రోజుల్లోగా రైతు ఖాతాల్లో సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకుంటారు.

సమష్టి నిర్ణయాలే విజయ సోపానాలు

సంఘ అభివృద్ధికి సమష్టి నిర్ణయాలే సోపానాలుగా నిలుస్తున్నాయి. సభ్యుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటారు. పాలకవర్గ సమావేశాల్లో ప్రతీ అంశంపై అర్థవంతంగా చర్చ జరుగుతుంది. సర్వసభ్య సమావేశంలో సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుంటారు. సకాలంలో రుణాలు చెల్లించేవారిని ప్రోత్సహిస్తారు.

సంఘ సమాచారం

సొసైటీ పరిధిలో రైతులు	8,999
సభ్యుల షేరు ధనం	రూ.30.67 లక్షలు
సభ్యుల డిపాజిట్లు	రూ.31 కోట్లు
నికర లాభం	రూ.24.47 లక్షలు
సభ్యులకు పంపిణీ చేసిన డివిడెండ్ సొమ్ము	రూ 4.8 లక్షలు
రుణాలు	రూ.15 కోట్లు

వైభవంగా వేడుకలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు

ఈనెల 15న జరగనున్న మునగపాక పీఏసీఎస్ శత వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని సంఘం పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉదయం 9.30 గంటలకు సంఘ ఆవరణలో వేడుకలను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ప్రారంభిస్తారన్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, రాష్ట్ర సహకార సంఘ రిజిస్ట్రార్ అహ్మద్‌బాబు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, రాష్ట్ర సహకార బ్యాంక్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు హాజరవుతారన్నారు. రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు ఆడారి గణేష్, కొయ్య వెంకటరావులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలతో ముమ్ముందుకు..



సొసైటీకి వచ్చే వారికి సకాలంలో సేవలందిస్తున్నాం. అవసరమైన మేర రుణం అందజేస్తున్నాం. రైతులు కూడా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరిస్తున్నారు. రైతులు, వినియోగదారుల సలహాలు, సూచనలతో సంఘం ఉమ్మడి జిల్లాలో ఆదర్శంగా నిలుస్తుంది. 15వ తేదీన శత వసంతాల వేడుకలను రైతుల సమక్షంలో నిర్వహిస్తున్నాం.

–ఆడారి వేణుగోపాలరావు, సంఘ సీఈవో

క్లుప్తంగా

ఆలిండియా కరాటే పోటీలకు నర్సీపట్నం క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు

నర్సీపట్నం: ఈ నెల 16, 17 తేదీల్లో వారణాసిలో జరగనున్న 8వ మామా(మానవ్ అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్) ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం ఆర్‌పీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఆర్.హేమంత్, ఎ.మనోజ్, జి.లిఖిత్‌రామ్, వై.అనన్య, ప్రశాంతి, బి.ప్రసన్న పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వీరిని మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుతాపల్లి శ్రీజ, కోచ్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మత్స్యకారుల గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదు

- కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ



నక్కపల్లి: మత్స్యకారుల గురించి మాట్లాడే అర్హత నారా లోకేష్‌కు లేదని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మత్స్యకారులకు తమ ప్రభుత్వం అన్యాయం చేసిందని, నష్టాల్లో ఉన్న సుగర్ ఫ్యాక్టరీలను ఆదుకోలేదని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. గంగపుత్రులకు అన్యాయం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. మత్స్యకారులను ఎస్టీల్లో చేర్చాలని కోరితే అరెస్టు చేసి బొక్కలో తోయిస్తా అని హెచ్చరించింది కూడా చంద్రబాబేనని ఎద్దేవా చేశారు. జాతీయ రహదారిపై కాకుండా తీర ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న మత్స్యకార గ్రామాల్లో పాదయాత్ర చేస్తే ఈ విషయాలన్ని లోకేష్‌కు తెలుస్తాయన్నారు. నియోజకవర్గంలో తాండవ, ఏటికొప్పాక చక్కెర ఫ్యాక్టరీలు మూతపడటానికి మీ బాబే కారణమన్న విషయాన్ని మర్చిపోతే ఎలా? అని లోకేష్‌ను ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వ విధానాల వల్లే సుగర్ ఫ్యాక్టరీలు మళ్లీ నష్టాల్లోకి కూరుకుపోయాయన్నారు. చంద్రబాబు చేసిన తప్పులు, పాపాలను సీఎం జగన్‌పై నెట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు.

ఆటకు సై

- రేపటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



ప్రారంభోత్సవ క్రికెట్ మ్యాచ్‌లో షాట్ కొడుతున్న మంత్రి అమర్‌నాథ్



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, చిత్రంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్రంలోని యువతకు క్రీడల పట్ల అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశంగా వార్డు స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 'ఆడుదాం ఆంధ్ర' అనే భారీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఐదు స్థాయిల్లో జరిగే ఈ పోటీలకు శుక్రవారం నుంచి తెరలేవనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించనున్నారు. 15 ఏళ్ల నిండి.. రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ తలపడే ఈ టోర్నీలో తొలి రెండు స్థాయిల్లో గ్రామ పంచాయతీ/వార్డు మొదలుకుని మండల స్థాయి వరకు ఐదు క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఈ స్థాయిలో ఆడేందుకు పూర్తి స్థాయిలో నియమ నిబంధనలు తెలియక పోయినా.. ఆట స్వరూపం తెలిసి ఉంటే చాలు. ఇక పూర్తి నియమ నిబంధనలతో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించి.. ఈ మూడు స్థాయిల్లో సత్తా చాటిన వారికి భారీగా నగదు ప్రోత్సాహకాలను అందించనున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లతో పాటు గ్రామీణ క్రీడలైన ఖోఖో, కబడ్డీ పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో విజేత జట్లు జిల్లా స్థాయిలో, అక్కడ సత్తా చాటిన జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడడానికి అర్హత సాధిస్తాయి. ఇలా రాష్ట్రంలోని ప్రతీ గ్రామ జట్టు ఆడుతూ ముందుకు సాగిపోయే ఈ టోర్నీ ఫిబ్రవరి 3తో ముగియనుంది. ఇప్పటికే రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ప్రతీ గ్రామ పంచాయతీ/వార్డు జట్లకు కిట్లను అందజేసింది. అయితే ఈ టోర్నీలో పాల్గొనే ముందు.. పోటీలు ఎలా ఉంటాయో తెలుసుకుంటే విజయానికి మానసికంగా సంసిద్ధులు కావచ్చు. ఇంకేందుకు ఆలస్యం.. ఆట మొదలు పెట్టేద్దామా.!

ఎవరీ కిట్టూ?



ప్రతీ మెగా టోర్నీకి ప్రత్యేక చిహ్నం ఉంటుంది. దాన్నే మస్కట్ అంటారు. బ్లాక్‌బక్ (కృష్ణజింక) మన రాష్ట్ర జంతువు. దీన్నే ఇండియన్ యాంటిలోప్ అని కూడా పిలుస్తారు. చురుకుదనం, వేగం దీని ప్రత్యేకత. అందుకే ఆడుదాం ఆంధ్రకు కిట్టుగా పిలుచుకునే కృష్ణజింకే మస్కట్‌గా నిలిచింది.

వాలీబాల్ స్పైకింగ్



18 X 9 మీటర్ల విస్తీర్ణంలో దీర్ఘచతురస్రాకార కోర్టులో ఆట సాగుతుంది. భూమి నుంచి 2.43 మీటర్ల ఎత్తులో పురుషులకు, 2.24 మీటర్ల ఎత్తులో మహిళలకు నెట్ ఎత్తు ఉంటుంది. ఇదే కోర్టును రెండు భాగాలుగా చేస్తుంది. ఆటలో ఆరుగురు ఆడుతుంటే మరో ఆరుగురు స్టాండ్ బైగా ఉంటారు. బెస్ట్ ఆఫ్ త్రీగా సాగే మ్యాచ్‌లో రెండు పాయింట్ల తేడాతో సెట్ డిసైడ్ అవుతుంది. ఇక ఆటగాడు రెండు సార్లు బంతిని తాకితే ఫౌల్. జట్టు మూడో సారి తాకిన బంతి ప్రత్యర్థి కోర్టులోకి వెళ్లాలి. లేకుంటే పాయింట్ చేజారుతుంది.

క్రికెట్ ఇలా ఆడేద్దాం



పది ఓవర్ల ఇన్నింగ్స్‌తో మ్యాచ్ సాగుతుంది. 11 మంది ఆటగాళ్లతో పాటు ఐదుగురు సబ్స్టిట్యూట్స్ ఉంటారు. ఎద్దైనా మార్పు ఉంటే ప్రత్యర్థి జట్టు కెప్టెన్ ఒప్పుకుంటే మార్చుకోవచ్చు. టాస్‌తో లక్ష్యమా, ఛేదన అనేది నిర్ణయించుకుంటారు. అంపైర్ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. మ్యాచ్ ప్రారంభానికి గంట ముందే మైదానంలో రిపోర్ట్ చేయాలి. గ్రామ పంచాయతీ/వార్డు, మండల స్థాయిల్లో హార్డ్ టెన్నిస్ బంతినే వినియోగిస్తారు. నియోజకవర్గ స్థాయి నుంచి నిబంధలన్నీ పక్కగా ఫాలో కావాలి.

ఖోఖో.. ఢీ..



12 మంది జట్టుగా ఉండే ఖోఖోలో 9 మంది 89 X 52 అడుగుల దీర్ఘచతురస్రాకార ఫీల్డ్‌లో ఆడతారు. టాస్ గెలిచి రన్నింగ్/ఛేజింగ్ ఎంచుకుంటారు. రన్నర్స్(డిఫెండర్స్) మూడు దఫాలుగా ముగ్గురు చొప్పున ఆటకు దిగుతారు. వీరిని ముట్టుకునేందుకు ప్రయత్నించే ఆటగాడు యాక్టివ్ ఛేజర్.. మిగిలిన 8 మంది కూర్చొని అవకాశం కోసం ఎగిరేందుకు సిద్ధపడే ఛేజర్లు. పోల్ డైవ్ ఈ ఆటలో అత్యంత ప్రతిభావంతమైన స్కిల్. ఐదు నిమిషాల వ్యవధితో సాగే ఆటలో రెండేసి ఇన్నింగ్స్ ఉంటాయి.

కూత పెడితే..



కబడ్డీ జట్టుకు 12 మంది ఆటగాళ్లు ఉంటారు. అయితే కూతకు దిగేది ఏడుగురే. పురుషులయితే 85 కేజీలు, మహిళలు అయితే 75 కేజీలలోపే ఉండాలి. 45 నిమిషాల పాటు సాగే ఆటలో 20 నిమిషాలు, 20 నిమిషాలు చొప్పున ఆడిస్తారు. మధ్యలో ఐదు నిమిషాలు బ్రేక్ ఉంటుంది. మహిళలకైతే 15 నిమిషాల చొప్పున ఆట సాగుతుంది. మధ్యలో ఐదు నిమిషాల పాటు బ్రేక్ ఇస్తారు. జట్టు ప్రత్యర్థి ఆటగాళ్లందరినీ ఔట్ చేస్తే అదనంగా రెండు పాయింట్లు(లూనా) వస్తాయి. కూతలో ప్రత్యర్థి జట్టు పూర్తిగా ఉన్నప్పుడు బోనస్ ఉంటుంది. నిర్ణీత సమయంలో పాయింట్లు సమమైతే చెరో ఐదు రైడ్లతో తిరిగి ఆట కొనసాగుతుంది. అప్పటికీ టై అయితే గోల్డెన్ రైడ్ అవకాశం ఇస్తారు.

'ఆడుదాం ఆంధ్రా' భారీ ర్యాలీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌కు మద్దతుగా బుధవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్ ఆధ్వర్యంలో ఎన్ఏడీ జంక్షన్ నుంచి డీఎల్‌బీ క్వార్టర్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విశాఖ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు.

రాకెట్‌తో స్మాష్‌లు



13.40 పొడవు, 6.10 మీటర్ల వెడల్పుతో ఉండే కోర్టులో బ్యాడ్మింటన్ ఆడాల్సి ఉంటుంది. టాస్ వేసిన తర్వాత సర్వీస్ లేదా కోర్టు అనేది నిర్ణయించుకోవాలి. స్కోర్ 21 పాయింట్లతో బెస్ట్ ఆఫ్ త్రీగా సాగుతుంది. ఒకవేళ విజేతను నిర్ణయించేందుకు మూడో సెట్‌లో 11 పాయింట్ల వద్ద కోర్టు మార్పు ఉంటుంది. సర్వీస్‌ను నడుము పై భాగం నుంచే చేయాలి. అప్పుడు రాకెట్ షాఫ్ట్ కిందకు చూస్తున్నట్లు ఉండాలి.

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గ	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.35 వేలు	రూ.60 వేలు	రూ.5 లక్షలు
ద్వితీయ	రూ..15 వేలు	రూ.30 వేలు	రూ.3 లక్షలు
తృతీయ	రూ.5 వేలు	రూ. 10 వేలు	రూ.2 లక్షలు

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు ఇలా..

స్థానం	నియోజకవర్గం	జిల్లాస్థాయి	రాష్ట్రస్థాయి
ప్రథమ	రూ.20 వేలు	రూ.35 వేలు	రూ.2 లక్షలు
ద్వితీయ	రూ.10 వేలు	రూ.20 వేలు	రూ. లక్ష
తృతీయ	రూ.5వేలు	రూ. 10 వేల	రూ.50 వేలు

ఈపీడీసీఎల్ సీఎండీ దృష్టికి విద్యుత్ సమస్యలు

- బస్సు యాత్ర విజయానికి కృషి చేసిన పార్టీ శ్రేణుల కు కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: చోడవరం నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చోట్ల సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజకు వినతిపత్రం అందించినట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. బుధవారం సీఎండీ కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలను కూలంకషంగా వివరించినట్లు తెలిపారు. గడచిన ఐదేళ్లలో సుమారు రూ.30 కోట్లతో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో కొత్తగా విద్యుత్‌లైన్లు, స్తంభాలు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే చోడవరం పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో ఇంకా లో ఓల్టేజీ, కొన్ని చోట్ల కొత్తగా హెవీలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నందున వాటిని పరిష్కరించాలని సీఎండీకి నివేదించారు. ఇటీవల తుఫాన్ కారణంగా చోడవరం మండలం ఏటి అవతల గ్రామాల్లోను, ఎర్రవాయు, పెద్దేరు ప్రాంతాల్లో స్తంభాలు, లైన్లు నేలకొరగడంతో వాటి స్థానంలో కొత్త లైన్లు వేయాలని కోరారు. నర్సయ్యపేట, కేపీ అగ్రహారం, కొంతలం గ్రామాల సమీపంలో కొత్తగా సబ్‌స్టేషన్లు, ఎస్ఈజెడ్ ఏర్పాటు యోచన ఉన్నందున కోమళ్లపూడి వద్ద 133 కేవీ లైన్, నర్సయ్యపేటలో సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు వేగంగా చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

బస్సు యాత్ర ఘన విజయం

చోడవరం: సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. వైఎస్సార్ సీపీ చోడవరం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ ఆదేశాలతో ఈ నెల 12న నియోజకవర్గంలో నిర్వహించిన బస్సు యాత్ర ఘన విజయానికి కృషి చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, వలంటీర్లు, వెలుగు సిబ్బంది, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తుపాను ప్రభావం నుంచి బయటపడ్డాక వరి పంట కోతల సమయం అయినా అన్ని వర్గాల ప్రజలు స్పందించి పెద్ద సంఖ్యలో బహిరంగ సభకు హాజరయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా రానున్న ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసే బాధ్యత ప్రతీ కార్యకర్త భుజాన వేసుకోవాలని కోరారు.



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజతో నియోజకవర్గ సమస్యలపై చర్చిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో విద్యుత్ పొదుపు వారోత్సవాల గోడ పత్రికలు, కరపత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రంలో ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్రనాథ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులచే ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్ షాపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకతపై అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర ప్లస్ కాదు.. మైనస్

- పెద్దలకు మాత్రమే లోకేష్ దర్శనం
- జెండా మోసే కార్యకర్తల్ని పట్టించుకున్నదే లేదు
- పాదయాత్రలో కనిపించని సామాన్య ప్రజలు

యలమంచిలి (అనకాపల్లి రూరల్): జిల్లాలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర నిర్లిప్తంగా ఉన్న పార్టీలో ఉత్సాహం నింపుతుందని ఆశపడ్డ కార్యకర్తలు భంగపడ్డారు. లోకేష్ పాదయాత్ర కోసం హైవేపై చేతి చమురు వదిలించుకుని మరీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వారిలో చాలా మంది చిన్న సార్‌తో ఫోటోలు దిగుదామని కలలుగన్నారు. కానీ రోప్‌పార్టీ, యువగళం టీం సభ్యులు గ్రామ స్థాయి నాయకులనే కాదు, మండల స్థాయి నాయకులను కూడా లోకేష్ దరికి చేరనివ్వలేదు. ఏళ్ల తరబడి జెండాలు మోసిన పచ్చనేతలతో కరచాలనం చేయాలన్న ఆలోచన కూడా లోకేష్‌కు కలగలేదని చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పైగా కరచాలనం, సెల్ఫీకోసం ఎగబడ్డ వారిపై యువనేత చిరాకు పడుతున్నాడని చెప్తున్నారు.

శిబిరం దగ్గరా.. నో ఎంట్రీ

పాదయాత్ర రోజుకు కేవలం రోజుకు నాలుగైదు గంటలు మాత్రమే కొనసాగుతోంది. పాదయాత్ర ముగింపు తరువాత బస చేసే చోటయినా ఉదయం లేదా రాత్రి సమయంలో లోకేష్‌ను కలవాలని వెళ్తున్న వారికి గంటల కొద్దీ నిరీక్షణే. కేవలం మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న బడా పారిశ్రామికవేత్తలకు తప్ప, జెండాలు మోసే గ్రామస్థాయి నాయకులకు దర్శనం దొరకట్లేదని ఆ పార్టీ నాయకులే తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. నక్కపల్లి సమీపాన మాజీ ఎమ్మెల్యే అనిత నివాసం వద్ద లోకేష్ మంగళవారం రాత్రి బస చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, పార్టీ పెద్దలు దగ్గరుండి పిలిస్తే తప్ప ఎవరూ లోపలికి వెళ్లలేని పరిస్థితి. ఎస్ రాయవరం తెలుగు మహిళ మండలశాఖ అధ్యక్షురాలుసహా ఎంతోమంది మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు, మండల స్థాయి టీడీపీ ముఖ్యనేతలను కూడా యువగళం టీం లోపలికి రానీయకుండా తోసేయడంతో వారంతా చిన్నబుచ్చుకుంటున్నారు. యువగళం టీం ఓవరాక్షన్, ప్లానింగ్‌లేని పాదయాత్ర, జెండాలను మోసేవారికి ప్రాధాన్యత లేకపోవడంతో ఈ పాదయాత్ర పార్టీకి ప్లస్ కాదని, మైనస్సే అని పచ్చనేతలే గుసగుసలుపోతున్నారు.

ఎస్సీ వర్గీకరణపై చంద్రబాబు మౌనం తగదు

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

అనకాపల్లి టౌన్: ఎస్సీ వర్గీకరణ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మౌనం వీడాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రైవేటు హోటల్లో జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వర్గీకరణకు చట్టం చేసిన బాబు ఇప్పుడు మౌనం వీడకుంటే మాదిగల నమ్మకద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. దీనిపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో టీడీపీ ఎంపీలు ప్రస్తావించేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలంతా కృషి చేయాలని కోరారు. విశ్వరూప మహాసభల్లో ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హామీపై మాదిగలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారన్నారు. వారికి ఏ రాజకీయ పార్టీ అండగా ఉంటుందో దానికే మద్దతు ఇచ్చేలా మందకృష్ణ మాదిగ భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. మాదిగ, ఉప కులాల అస్తిత్వ, రాజకీయ ఉనికిని చాటేలా ఫిబ్రవరిలో విజయవాడ కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు మంగరాజు, నాయకులు కొల్లి చిన్న అప్పారావు, యలకమల్లి బాబుమాదిగ, గంపల చినరాజు మాదిగ, కాకినాడ నాగేశ్వరరావు మాదిగ, చెవ్వేటి అప్పారావు మాదిగ, చెవ్వేటి సోమరాజు, ఏడిద సురేష్, చెవ్వేటి కమల, చంటిరాజు పాల్గొన్నారు.

విశాఖకు అదనంగా 15 ఎంజీడీల నీటి తరలింపు

- కాలువల అభివృద్ధికి రూ.600 కోట్లతో ప్రతిపాదనలు
- అనుమతి వచ్చిన వెంటనే పనులు ప్రారంభం
- విస్కో జీఎం, జీవీఎంసీ ఈఈ చిరంజీవి వెల్లడి



నాతవరం మండలంలో పర్యటిస్తున్న విస్కో జీఎం, జీవీఎంసీ ఈఈ చిరంజీవి, డీఈ కామేశ్వరరావు

నాతవరం: ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి విశాఖకు రోజుకు అదనంగా 15 ఎంజీడీల నీటిని తరలించేందుకు ప్రతిపాదనలు పంపించామని విస్కో జనరల్ మేనేజరు, జీవీఎంసీ ఈఈ చిరంజీవి చెప్పారు. ఆయన నాతవరం మండలంలో పలు ప్రాంతాల్లో తుపానుకు దెబ్బతిన్న ఏలేరు కాలువను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి ప్రస్తుతం రోజుకు 90 ఎంజీడీల నీటిని నగరానికి తరలిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విశాఖలోని ముడసర్లోవ, మధురవాడ ప్రాంతాలకు అదనంగా 15 ఎంజీడీల నీటిని తరలించేందుకు రూ.600 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కాలువలో పూడికలను తొలగించి, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విస్కో డీఈ కామేశ్వరరావు, జేఈ నానాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు కాశీపురం విద్యార్థిని

- జిల్లా సంప్రదాయక ఆట బొమ్మల తయారీలో ప్రథమ స్థానం



విద్యార్థిని వరలక్ష్మికి పురస్కారం అందిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రవి

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీలకు మండలంలోని కాశీపురం హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని బాలిబోయిన వరలక్ష్మి ఎంపికైంది. మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో భీమిలి ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో ఉమ్మడి జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయక ఆట బొమ్మల తయారీలో ఆమె ప్రథమ స్థానంలో నిలిచి భీమిలి డైట్ ప్రిన్సిపాల్ జి.రవి నుంచి జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ నెల 14, 15 తేదీల్లో అమరావతిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాల్గొననుందని హెచ్‌ఎం పి.బి.టి. సుందరీ తెలిపారు. ఇదే హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొరువాడ విజయ జిల్లా స్థాయి జానపద పాటల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. వీరిని ఎంఈవోలు, బి.పడాల్ దాస్, వి. ఉషారాణి, హెచ్‌ఎంతో పాటు సర్పంచ్ ఎ. వరలక్ష్మి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాసరి సూర్యనారాయణ బుధవారం అభినందించారు.

క్లుప్తంగా

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: మండలంలోని తుమ్మపాల సచివాలయం-2 పరిధిలో, పట్టణంలోని 80వ వార్డు 23 సచివాలయం పరిధి అంబేడ్కర్‌నగర్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజులు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ వివరాల డిస్‌ప్లే బోర్డు, ప్రధాన కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధి సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు


డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: డ్రైనేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అధికారులకు సూచించారు. మండలంలోని పిసినికాడ పంచాయతీ బీఆర్టీ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థను కాలనీవాసులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అక్కడే ఉన్న గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ మొల్లేటి హైమ, పార్టీ నేతలు శివాజీ, సత్తిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


డిపో గేటు వద్ద నిరసనలో ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి బుధవారం విధులకు హాజరయ్యారు. లంచ్ విరామ సమయంలో డిపో ముందు నిరసన తెలిపారు. కార్మికులను ఉద్దేశించి సంఘ రీజినల్ కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రధాన డిమాండ్లను వివరించారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించి, ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. నిరసన ప్రదర్శనలో డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు, సంఘ సహాయ కార్యదర్శి ఎంఎస్ నాయుడు, ఎంవీఎస్‌కేపీ వర్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 1,436 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,960	4,640
రెండో రకం	3,880	4,140
మూడోరకం	3,500	3,950

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్	: సత్యనారాయణస్క్రీన్-1
-------	: సత్యనారాయణస్క్రీన్-2
యానిమల్	: షిర్డిసాయి
హాయ్ నాన్న	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
కోటబొమ్మాళి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుదవారం 391 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 373 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.




నరసింగబిల్లి హైస్కూల్లో సుందరీకరణ పనులు


అందంగా రూపుదిద్దుకున్న జి.భీమవరం ప్రాథమికోన్నత పాఠశాల

నాడు-నేడుతో సర్కారీ స్కూళ్లకు కొత్త జీవం


నాడు-నేడులో నరసింగబిల్లి హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్‌పై విద్యార్థులు

నాడు: పెచ్చులూడే శ్లాబ్‌లు. పగిలిన గచ్చు(ఫ్లోర్)లు. వేసవి ఉక్కబోత. నేల మీద, చెట్ల కింద చదువులు. తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లు, దుర్గంధంతో నిండిన మరుగుదొడ్లు, తాగునీటి కోసం అయితే చెప్పాల్సిన పనిలేదు. ఇదీ.. గత ప్రభుత్వాల్లో సర్కారీ స్కూళ్ల దుస్థితి.

నేడు: విద్యార్థులకు సరిపడా విశాలమైన తరగతి గదులు. కూర్చునేందుకు డెస్క్‌లతో కూడిన పటిష్టమైన బెంచీలు. విద్యుత్ సౌకర్యం. తాగునీటికి ఆర్వో ప్లాంట్. అత్యాధునిక మరుగుదొడ్లు. సీఎం జగన్ పాలనలో సర్కారీ స్కూళ్లు కార్పొరేట్‌కు దీటుగా మారాయి.

మండలంలో 49 స్కూళ్ల అభివృద్ధి
రూ.8 కోట్ల వ్యయంతో పనులు
ప్రగతిలో మరో రూ.కోటి పనులు

నాడు-నేడులో చేపట్టిన పనులు
రన్నింగ్ వాటర్‌తో ఆధునిక మరుగుదొడ్లు
ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ
తాగునీటి సరఫరా వ్యవస్థ(ఆర్వో ప్లాంట్)
విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్
పాఠశాలకు అందంగా పెయింటింగ్స్
పెద్ద, చిన్న మరమ్మతులు
గ్రీన్ బోర్డులు
ఇంగ్లిష్, సైన్స్ ల్యాబ్స్
ప్రహరీ గోడలు

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్నమైన మార్పులు తీసుకు వచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మౌలిక సదుపాయాలు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. రెండు విడతల మన బడి నాడు-నేడులో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. భవనాలకు మరమ్మతులు చేసి, రంగులు వేసి, వివిధ రకాల బొమ్మలతో విద్యార్థులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. నేలపై కూర్చునే పరిస్థితి లేకుండా విద్యార్థులకు డెస్క్‌లతో కూడిన బెంచీలను ఏర్పాటు చేశారు. చాలా స్కూళ్లలో అదనపు తరగతి గదులు, అధునాతన టాయిలెట్‌లను నిర్మించారు. మండలంలో నాడు-నేడు తొలి దశ



పనులు పూర్తయ్యాయి. రెండో విడతలో పలు స్కూళ్లలో తరగతి గదులు నిర్మాణంలో ఉన్నాయి. చాలా స్కూళ్లకు డిజిటల్ బోర్డులు అమర్చారు. దీంతో డిజిటల్ విధానంలో విద్యా బోధన జరిగి, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిమానాన్ని సర్కారీ స్కూళ్లు చూరగొంటున్నాయి.

కశింకోటలో నాడు-నేడు పథకం

కశింకోట మండలంలో ప్రభుత్వ పాఠశాలలు	59
నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలు	49
రెండు విడతల్లో చేసిన ఖర్చు	రూ.8 కోట్లు
ఇంకా మిగిలి ఉన్న పనుల విలువ	రూ.కోటి
ఉపాధ్యాయుల సంఖ్య	143 మంది
ప్రస్తుత విద్యార్థుల సంఖ్య	5550 మంది

స్కూల్ ఇష్టంగా మారింది



గవర్నమెంట్ స్కూళ్లు ఇంత గొప్పగా డెవలప్ అవుతాయని ఏ రోజూ అనుకోలేదు. నా ఫ్రెండ్స్ కొందరు ప్రైవేట్ స్కూల్లో చదువుతున్నారు. వారు మా స్కూల్‌కు వచ్చినపుడు వాళ్ల స్కూల్ కంటే మాదే చాలా బాగుందని చెప్తుంటే హ్యాపీగా అనిపించింది. నాడు-నేడు పథకంలో స్కూల్‌ను బాగా డెవలప్ చేశారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలు ఉండటంతో స్కూల్‌కు వచ్చి చదువుకోవడం ఇష్టమైన వ్యాపకంగా మారింది.

–పి.కుసుమదుర్గ, 9వ తరగతి

అప్పటికీ.. ఇప్పటికీ ఎంతో తేడా



నాడు-నేడు నిధులతో స్కూల్లో మౌలిక సదుపాయలు పెంచారు. గతంలో టాయిలెట్స్ కోసం చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఇపుడు మా ఇంట్లో కూడా అలా ఉండవు. అంత గొప్పగా ఉన్నాయి. తరగతి గదుల్ని చాలా బాగా డెవలప్ చేశారు. పేరెంట్స్‌కు పిల్లల చదువుల భారం తప్పింది. పేద పిల్లల చదువుల కోసం ఇంతగా తపన పడుతున్న జగన్ మామయ్య అంటే ఇష్టం పెరిగింది. – కె.సౌమ్య, 10వ తరగతి

మార్గశిర పూజలు ప్రారంభం

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో బుధవారం మార్గశిర మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి అర్చకుడు వి.కృష్ణ విశేష పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం తొలి గురువారం సందర్భంగా ప్రత్యేక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్ తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

వైభవంగా పోలిపాడ్యమి పూజలు

కశింకోట: పోలి పాడ్యమి సందర్భంగా కశింకోట శారదానది భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం ముగియడంతో సంప్రదాయంగా నదిలో స్నానాలు ఆచరించి, కార్తీక దీపాలు విడిచిపెట్టారు. స్థానిక గవరపేటలో పోలి పాడ్యమి పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు పండ్లు, దీపం, బియ్యం, కూరగాయలతో పురోహితులకు స్వయంపాకం దానమిచ్చారు. స్థానిక వేంకటేశ్వరస్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాలను దర్శించి, ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. శివాలయం, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనృసింహస్వామి ఆలయాలను, గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను దర్శించుకుని, పూజలు చేశారు.

ఘనంగా గౌరమ్మ నిమజ్జనం


ట్రాక్టర్‌పై గౌరీపరమేశ్వరుల ఊరేగింపు

కశింకోట: కశింకోటలోని గవరపేట ఆది గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) ఉత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరమ్మను ట్రాక్టర్‌పై నిలిపి గ్రామ వీధుల్లో మహిళల కోలాటాలు, బాణసంచా వెలుగుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో పెద్ద గుమ్మం వద్ద శారదానదిలో నిమజ్జనం చేశారు.

జగన్ వల్లే విద్య, వైద్యంలో విప్లవాత్మక మార్పులు

- 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు


తగరంపూడి సచివాలయంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్


80వ వార్డులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న రత్నాకర్


బయ్యవరంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

అనకాపల్లిటౌన్: విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని తగరంపూడి సచివాలయంలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యాన్ని రెండు కళ్లుగా భావించి, వాటిని రాష్ట్ర ప్రజలకు చేరువ చేయడంలో తమ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సక్సెస్ అయిందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అందంగా తీర్చిదిద్దిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తొలుత రూ.30.53 కోట్లతో సచివాలయ పరిధిలో అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. స్థానికులకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మళ్లీ సీఎంగా జగనే ఎందుకు కావాలో వివరించే బ్రోచర్లు పంపిణీ చేశారు. అక్కడే పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఈవోఆర్డీ ధర్మారావు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, గ్రామ అధ్యక్షుడు యన్నంశెట్టి శ్రీను, పార్టీ నేతలు యాదగిరి రామచంద్రరావు, మర్రిపల్లి శోభ, పద్మ, లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, కార్యకర్తలు, వలంటీర్లు, అభిమానులు పాల్గొన్నారు.

80వ వార్డులో..

అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని ఆ పార్టీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. 80వ వార్డు గవరపాలెం 21వ సచివాలయంలో కార్పొరేటర్ కొణతాల నీలిమ అధ్యక్షతన జరిగిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లిన గొప్ప నేతగా జగన్ చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. విద్యార్థులకు వసతి, విద్యాదీవెన, అమ్మఒడి పథకాలతో ఉన్నత శిఖరాల వైపు నడిపిస్తోంది తమ ప్రభుత్వమేనన్నారు. ఒక్క విద్యారంగానికే కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. అంతకుముందు సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమంపై డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు.

జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ పరిధిలో ప్రజలకు బ్రోచర్లు అందించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్సీ ఎస్.వెంకటరమణ, పార్టీ నేతలు పొలిమేర శివఅప్పారావు, కర్రి అప్పాజీ, కోరుమిల్లి ఆరుద్ర, కాండ్రేగుల చందు, పెంటకోట సన్యాసినాయుడు, సూరిశెట్టి రవి, కాండ్రేగుల దేవా, కోన కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే ఆదర్శవంతమైన పాలన

కశింకోట: గతంలో ఎన్నడూ లేని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని బయ్యవరం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తదితర వినూత్న కార్యక్రమాలను ప్రశంసిస్తూ, వాటిని తమ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు అక్కడి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయంటే జగన్ పాలన ఎంత గొప్పగా ఉందో తెలుసుకోవచ్చున్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమానికి అవిరళ కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో అన్న సమారాధన


అన్న సమారాధనను ప్రారంభిస్తున్న మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: అన్నిదానాల కన్నా అన్నదానం గొప్పదని నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అన్నారు. అమ్మవారి ఆలయ ఆవరణలో ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో బుధవారం కూరగాయల వర్తకుడు మళ్ల జగ్గఅప్పారావు దంపతులు అమ్మవారికి ఉపారం సమర్పించి అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షణ్ముఖ స్వీట్స్ అధినేత కంభంపాటి భాను అందించిన 18 రకాల మిఠాయిలను మంగళవారం రాత్రి జరిగిన అమావాస్య పూజలో అమ్మవారికి నివేదించామన్నారు. కార్యక్రమంలో ఈవో బండారు ప్రసాద్, ధర్మకర్తలు బుద్ద నర్సింగరాజు, పీలా లక్ష్మీ శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు కొందూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ, సన్నిబాబు, కంటపల్లి శోభారాణి, వెంకటరావు, మళ్లవరపు ఈశ్వరరావు, అర్చకులు మనమండ్ర శ్రీనివాసు, సందీప్‌శర్మ పాల్గొన్నారు.

పంటల బీమా అమలు చేయాలి

అనకాపల్లిటౌన్: ప్రతి రైతు కుటుంబానికి పంటల బీమా అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కోరారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా ఆందోళన నిర్వహించారు. మిచాంగ్ తుపాను వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టం ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అందజేయాలని కోరారు. పత్తి, మిరప, అరటి పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలన్నారు. పంట కోల్పోయిన రైతులకు పంట రుణం మాఫీ చేయాలని, ఇరిగేషన్ కాలువలను తక్షణమే ఆధునికీకరించాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరాజు, జోనల్ ఇన్‌చార్జి జి.భక్తసాయిరాం, జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, పట్టణ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పట్టా ప్రసాద్, పార్టీ నేతలు చదరం నాగేశ్వరరావు, వుడా రమేష్, కశిరెడ్డి శ్రీను, కర్రి రామకృష్ణ, గల్లా రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న భద్రం

అనకాపల్లిటౌన్: ఆటో కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్ భద్రం కోరారు. స్థానిక చోడవరం బస్టాప్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 21, 31లతో గతంలో రూ.100 ఉన్న జరిమానాలు రూ.వేలల్లో పెంపు, డీజిల్, పెట్రోల్ ధరలను కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం అన్యాయమన్నారు. ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని కార్మికులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పెద్దింటి నాగేశ్వరరావు, మోహన్, రమణబాబు, సూరిబాబు, పెంటారావు, శంకర్, ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు శ్రీరామదాసు అబ్బులు, ప్రతినిధులు తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, కేవీ రమణ పాల్గొన్నారు.

ఘనంగా వెండి కవచం, చీర అలంకరణ


లక్ష్మీనృసింహస్వామి, లక్ష్మీ అండాళ్ అమ్మవారి సన్నిధిలో రత్నాకర్


శారదానది ఒడ్డున అన్నసమారాధన ప్రారంభిస్తున్న రత్నాకర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం దిబ్బవీధి శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామికి వెండికవచం, శ్రీలక్ష్మీ అండాళ్ అమ్మవారికి వెండిచీర అలంకరణ బుధవారం నేత్రపర్వంగా జరిగింది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా విశ్వక్సేన పూజ, అగ్నిప్రతిష్ఠ, మృత్యుంగ్రహణం, దీక్షధారణ, హోమం భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ స్వామివారిని దర్శించుకుని హోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆయన్ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బొడ్డపాటి చినరాజారావు, కటారి దేముడు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలు.. దానధర్మాలు

కార్తీకమాస అమావాస్య మర్నాడు, మార్గశిర పాడ్యమి పోలిస్వర్గంను పురస్కరించుకుని స్థానిక శారదానదిలో పుణ్యస్నానాలకు మహిళా భక్తులు భారీగా తరలివచ్చారు. ఇక్కడ తెల్లవారుజాము నుంచే స్నానాలాచరించి, అరటి దొప్పల్లో దీపాలు వెలిగించి నదిలో విడిచి, నమస్కారాలు చేశారు. అక్కడే ఉన్న బ్రాహ్మణులకు శక్తికొలది స్వయంపాకదానం అందించారు. నది ఒడ్డున ఉన్న ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అడ్డబోయిన నారాయణరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు జామి రామయ్య, ఉపాధ్యక్షులు పలకా చంటి, ప్రధాన కార్యదర్శి జెట్టి సూరిబాబు, కోశాధికారి కర్రి జగ్గఅప్పారావు, పాలకవర్గ సభ్యుడు పలకా కాసులు, యల్లపు శ్రీను, ఇంటి త్రినాథ్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భోగలింగేశ్వరాలయంలో అన్నదానం

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అన్న సమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ నెల రోజులపాటు సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా అన్నదాన చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల ఆందోళన

కశింకోట: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండో రోజు బుధవారం కూడా కశింకోటలో సమ్మె చేశారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు మజ్జి నాగేషు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించకుండా ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు.

బాకీ తీర్చమన్నందుకు తమ్ముడిపై అన్న దాడి


గాయపడ్డ సమ్మంగి కృష్ణ

సబ్బవరం: తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు తమ్ముడిపై అన్నదాడి చేసిన ఘటన సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో చోటు చేసుకోంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు... గ్రామానికి చెందిన సమ్మంగి దేముడుబాబు, కృష్ణ అన్నదమ్ములు. 18 ఏళ్ల కిందట అన్న దేముడుబాబు ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు సర్దుబాటు చేయమని తమ్ముడు కృష్ణను అడిగాడు. దీంతో కృష్ణ తన వద్ద ఉన్న రూ.50 వేలు ఇచ్చాడు. అయితే ఇటీవల కృష్ణ కొత్తగా ఇల్లు నిర్మాణం ప్రారంభించాడు. తన వద్ద తీసుకున్న రూ.50 వేలతో పాటు ఉమ్మడిగా ఉన్న ఆస్తి పంచాలని కృష్ణ మంగళవారం రాత్రి అన్నను అడిగాడు. ఇది వివాదం కావడంతో అన్న దేముడుబాబుతో పాటు వదిన వెంకటలక్ష్మి,కుమారుడు వినయ్ కలిసి దాడి చేశారు. దీంతో కృష్ణ తల,శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు బుధవారం తన భార్య నూకరత్నంతో కలిసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంగనాథం తెలిపారు.